కథ

# రాజుమీద ఆసు

గంటి భానుమతి

దీక్షితులకి తెల్లారింది. కానీ కాఫీ చెయ్యాల్సిన కోడలుకి ఇంకా తెల్లార లేదు. అందుకే ఇంకా పడుకుని ఉంది. దీక్షితులు లేవడం, మొహం కడిగే సుకోవడం అయింది. నాలుక పిడచ కట్టింది. ఏమీ తోచడం లేదు. అటు ఇటూ ఈ గదిలోంచి ఆ వరండాలోకి, అక్కడి నుంచి వంటింట్లోకి, కాలు కాలిన పిల్లిలా తిరుగుతున్నాడు. వెంటనే కాఫీ గొంతులో పడకపోతే ప్రాణం ఆగేట్లు లేదు. ఎలా!


కోడలు లేవాలి. డికాషన్ వేయాలి. పాలు కాచాలి. డికాషన్ దిగాలి. కాఫీగా రూపాంతరం చెందాలి. అప్పుడు చేతిలోకి రావాలి. లాంగ్ ప్రాసెస్.

మెల్లగా భార్య భ్రమరాంబని తట్టిలేపాడు.

''భ్రమరం...లే...కాఫీ పెట్టు..''

''చార్జి కోడలుకిచ్చేశాను'' అటు తిరిగి పడుక్కుంది.

సరిగ్గా నెల క్రితం కోడలు హోదాలో వరలక్ష్మి ఆ ఇంట అడుగు పెట్టింది. గృహ సామ్రాజ్యంలో కొన్ని అధికారాలు వారసత్వంగా, అంటే అత్త నుంచి కోడలికి రావల్సినవి వచ్చాయి. అందులో కాఫీ, వంట లాంటివి కూడా ఉన్నాయి.



''అమ్మాయి ఇంకా లేవలేదు. పోనీ నెస్కాఫీ తాగేస్తాను. ఇదివరకు నేనే చేసుకునే వాడిని కదా అలాగే...''

ఇటువైపు టక్కున తిరిగి దీక్షితులని చూసింది నిద్రకళ్లతో.

''మీకు మతి కానీ పోయిందా ఏవిటీ? అలవాటే అని పెట్టుకుంటే అలుసయిపోరూ! ఏదో నా హయాం వేరు. కోడలు హయాం వేరు అత్తగారు, మామగారు అంటే భయం ఉండాలి - లేకపోతే - ఇదిగో ఇలా ఉంటుంది. చెప్తా అది లేవనీండి... టైం టేబుల్ ఇస్తాను. పొరపాటు రాకుండా చూసుకోమని గట్టిగా చెప్తాను. అసలు కోడలు ఎలా ఉండాలి - అత్తగార్ని మామగార్ని చూసి వణికిపోవాలి లేకపోతే...''

'సడేలే- నువ్వే బెస్ట్ పర్సన్‌వి ఇవి చెప్పడానికి. మీ అత్తగారంటే, మామగారంటే ఎంత భక్తి, భయం ఉన్నాయో, ఎలా అడుగులకి మడుగులొత్తావో నాకు తెలీదా' అని అనుకుంటూ బయటికి నడిచి, తిన్నగా వీధికి చివర, రోడ్డుకి మొదట్లో ఉన్న సాయిదర్శినిలోకి దూరాడు.

''ఇదేవిట్రా నువ్వు మొదటి దోసు కోసం వచ్చావా!'' అంటూ నాగేశ్వర్రావు కాఫీ తాగుతూ పలకరించాడు.

ఓ వెర్రి నవ్వు నవ్వాడు.

''ఏం, అత్తాకోడళ్లిద్దరూ సరదాగా ఎక్కడికయినా వెళ్లారా!''

వాడి మాటల్లో ఎంత వ్యంగ్యం ఉందో వెతకడానికి ప్రయత్నిస్తున్నాడు.

నాగేశ్వర్రావు, దీక్షితులు ఒక ఊరి వాళ్లు. ఒకే స్కూల్లో చదివారు. ఒకేసారి హైదరాబాద్ వచ్చారు. మొదట్లో ప్లీడరు గుమస్తాల్లాగా పనిచేశారు. ఇద్దరికీ గవర్నమెంటు ఉద్యోగాలు దొరికాయి. ఇద్దరూ కూడా వనస్థలిపురంలో ఇళ్లు కట్టుకున్నారు. ఆ ఏడాదే రిటైరయ్యారు. అయితే నాగేశ్వర్రావు మళ్లీ ప్లీడరు గుమస్తాగా పనిచేయడం మొదలెట్టాడు.

నిట్టూర్చాడు.

''కొత్త కోడలు లేవలేదేవిటి? స్వేచ్ఛగా వచ్చేశావు హోటల్‌కి''

'కోడలు వచ్చింది కాబట్టే రెస్ట్రిక్షన్స్ ఎక్కువయ్యాయి' మనసులో అనుకున్నాడు.

''సర్లేరా! నీ అదృష్టం అలా ఉంది. అదిగో నా బస్సు వస్తోంది నేనుంటాను మరి'' అంటూ వెళ్లిపోయాడు.

నాగేశ్వర్రావుకి చెప్పడానికి సిగ్గుపడ్డాడు. పరిస్థితి ఏమీ బాగులేదని దీక్షితులకి తెలుసు అన్నీ అంశాలు.

''అసయ్యంగా, ఆ తెల్ల పంచెలు, గళ్ల లుంగీలు ఏవిటో! వియ్యాలవారి ముందు దర్జాగా ఉండాలి'' అని భార్య అంటే పైజామా లాల్చీలోకి శరీరాన్ని మార్చేశాడు.

''ఇదివరకు లాగా అస్తమానం వంటింట్లోను, వంటింటి ముందు తచ్చాడకండి...అరగంటకో సారి కాఫీ అంటూ, టీ అంటూ నా వెనక్కాల తిరిగినట్లుగా కోడలి వెనక్కాల తిరగకండి. మూసిన తలుపులు తోసే ముందు, దగ్గడమో, గొంతు ఖూడించడమో చెయ్యండి లేదా తలుపు కొట్టండి'' ఇవన్నీ భార్య అన్నవే.

చిన్నగా నిట్టూర్చి, కాఫీకి డబ్బులిచ్చి, ఓ వారపత్రిక కొన్నాడు.

నాలుగు రోజుల క్రితం కోడలు దోసెలు వేస్తోంది. అలవాటుగా వంటింట్లోకి తొంగి చూశాడు. కోడల్ని చూసి భార్య దగ్గరికొచ్చాడు.

''దోసె బాగా రోస్ట్ చేయమని అంటాను'' అన్నాడు.

''కూచోండి. కోడలు మీకు ప్లేటులో ఇచ్చినప్పుడు మీకెలా కావాలో చెప్పండి. వంటింట్లోకి వెళ్లి చెప్తే చీప్ అయిపోతారు.''

ఇదివరకూ పెసరట్లయినా, మామూలు దోసెలయినా తనే వేసుకునేవాడు. భార్య చేస్తే నచ్చేది కాదు.



## అంతా కాలమహిమ!

**హృతిక్ రోషన్ సూపర్ డూపర్ హిట్ చిత్రం (తొలిచిత్రం) 'కహోనా ప్యార్ హై'లో హీరోయిన్‌గా ముందు కరీనా కపూర్‌ని అనుకున్నారు. ఆ తర్వాత అమీషా పటేల్ ఎన్నికైంది. అసలు వీళ్లకన్నా ముందు ఐశ్వర్యా రాయ్‌ని అనుకుని అబ్బే ఆమె హృతిక్ కన్నా బాగా 'ఏజ్డ్'గా కనిపిస్తుంది-అని వద్దనుకున్నారట. ఆ సంగతి తర్వాత తెలిసిన ఐశ్వర్యారాయ్ ఎప్పటికీ హృతిక్ సరసన నటించకూడదని ఒట్టుపెట్టుకుందిట. ఐతే ఇప్పుడా ఒట్టుతీసి గట్టు మీద పెట్టిందేమో- హృతిక్ సరసన ఓ చిత్రంలో ఐశ్వర్య నటించడానికి ఒప్పుకుంటున్నట్టు బాలీవుడ్ వార్తలు వినిపిస్తున్నాయి. కాలం తెచ్చే మార్పేమో!**

వంకాయదో, అరటికాయదో ముచ్చిక కోసి, నూనెలో మంచి పెనం మీద సమానంగా రాసి, బాగా నెరుపుకుని, తన దోసెలు వేసుకుని, వేడి వేడిగా తింటూ మధ్యే మధ్యే పానీయంలాగా కాఫీయో, టీయో తనే చేసుకుని తాగేవాడు.

ఫ్! ఏవిటో ఆనందం అంతా పోయినట్లనిపించింది.

ఇవన్నీ తన కష్టాలు. నాగేశ్వర్రావు దృష్టిలో కాకపోవచ్చు. కొన్ని అనుభవించినప్పుడే తెలుస్తాయి. వినేవాళ్లకి అర్థం కాదు.

పైగా విన్న వాళ్లు తేలికగా కొట్టిపారేస్తారేమో.

ఇదంతా కోడలి ఇంట్లో అడుగు పెట్టినప్పట్నుంచీ చోటు చేసుకున్న మార్పులే.

అయినా ఇందులో కోడలి తప్పేం ఉంది? ఈ లక్ష్మణరేఖలన్నీ ఆమేమీ గీయలేదు కదా! ఇవన్నీ భ్రమరాంబ గీసిన గీతలు.

పెళ్లయ్యాకా కోడళ్లకి ఆంక్షలుంటాయని తెలుసు. కానీ మామగార్లకి కూడానా!

గేటు తీసి, లోపలికెళ్లాడు.

సోఫాలో కూచుని, టీవీలో భక్తి కార్యక్రమం చూస్తూ కాఫీ తాగుతున్న భ్రమరాంబ, దీక్షితుల్ని చూడగానే-

''అమ్మాయ్! మీ మామగారు వచ్చారు. కాఫీ తీసుకురా! గజం కాఫీ అంటే ఏవిటో చెప్పాను కదా! ఊబలంక కాఫీలాగా ఓ గ్లాసు లోంచి మరో గ్లాసులోకి గజం ఎత్తు నుంచి తిరగబోస్తూ నిండా నురగ నురగలతో ఉండాలి'' అంది.

ఈ పదాలు, దాని వరస అన్నీ కూడా దీక్షితులవే. అది ఒకప్పుడు. అప్పుడు ఇదే విధంగా కాఫీ కావాలంటే-

''కాఫీ తాగడం ప్రధానం. అంతే కానీ ఊబలంక, గజంకాఫీ అంటూ యాగీ చెయ్యకండి. ఇచ్చింది తాగడం అలవాటు చేసుకోండి'' అనేది.

పనులు చేయడం కన్నా చేయించడం తేలికన్న మాట. కాఫీ తాగడం అయిపోయింది కాబట్టి, కోడలు తెచ్చే కాఫీకి తొందరపడలేదు. తీరిగ్గా పేపరు మడత విప్పాడు.

''ఏమ్మా! కాఫీ తేవడానికింత సేపా! చెంగు చెంగున పనులన్నీ గబగబా చేసేయాలి 'తే' అనగానే కాఫీతో వచ్చేయాలి''

పేపరుని కొంచెం పక్కకి తప్పించి కాఫీ గ్లాసుతో నుంచున్న కోడలికేసి చూసి గ్లాసందుకున్నాడు.

''పనులు చకచకా చేయడం నేర్చుకోవాలి. అయినా అది ఓ కళ. అది అందరికీ రాదనుకో. నా పెళ్లయిన కొత్తలో, నన్ను మీ మామగారు కాపరానికింకా హైద్రాబాద్ తీసుకెళ్లలేదు. అప్పుడు రాజమండ్రిలో అత్తగారింట్లోనే ఉండేదాన్ని. అప్పుడు పుష్కరాలు వచ్చాయి. మనవాళ్లంతా ఓ వారం ముందుగానే దిగిపోయారు. వెళ్లేవాళ్లు వెళ్లడం, వచ్చేవాళ్లు రావడం. చుట్టాలే కాదు, తెలిసిన వాళ్లు, స్నేహం కొద్దీ వచ్చేవాళ్లు. ఇల్లు నిజంగా ఓ సత్రం. నేనయితే వాళ్లకి మంచినీళ్లు, నిమ్మకాయ నీళ్లు, దబ్బాకులు వేసిన మజ్జిగ చేసి అదీ అందించేదాన్ని. రాత్రి పక్కలు వేసేదాన్ని. అంతా ఒకటే మెచ్చుకోవడం, అయ్‌బాబోయ్, అయ్‌బాబోయ్, మన మాణిక్యం కోడలు ఎంత పనిమంతురాలో. ఎలా కలసిపోతుందో అని, ఉ...ఏక...పొగిడేయడం అనుక్కో....'' ప్రవాహం సాగిపోతోంది.

కోడలివైపు చూశాడు.

నీళ్లు ఒక్కటే ఆ కళ్లలో రావడం తరువాయి.

కానీ, దీక్షితులు ఏం చేయగలడు! పాపం అనుకున్నాడు. ఎలా నెగ్గుకొస్తుందో ఏమో!

''అమ్మయ్! ఇందాకా వాకింగ్‌కి వెళ్తున్నప్పుడు, కూరలబ్బాయి దగ్గర కాబేజి తీసుకున్నాను. దాన్ని, కొబ్బరి వేసి కూర చెయ్యి. అబ్బాయి చపాతీల్లోకి తీసుకెళ్లడానికి కూడా బావుంటుంది. నిన్న పేరంటంలో వచ్చిన సెనగలున్నాయి కదా! వంకాయ సెనగలు ముద్ద కూర చేయి. ఏం..''

''అలాగేనండి'' అని బుద్ధిగా తలూపింది.

పాపం! మళ్లీ అనుకున్నాడు దీక్షితులు.

''ఏమ్మా! మీ అమ్మ కాబేజి ఇలాగే తరుగుతుందా?''

కోడలు పిల్ల ముఖం చిన్నబుచ్చుకుంది.

''ముందు కూరలు తరగడం నేర్చుకోవాలి. నిన్ను కాదు, మీ అమ్మకి తెలియాలి ఆ సంగతి. అయినా కాబేజి తరగడం అనేది అందరికీ రాదు. అది ఓ కళ. నేను హైదరాబాద్ వచ్చిన కొత్తలో, రాజోలు నుంచి, మా నాగుబాబాయి వచ్చాడు మన వైపున, ఆ రోజుల్లో ఈ కాబాజే, గోబీపువ్వు లాంటివి దొరికేవి కాదు. అందుకని బాబాయి కోసం అని కాబేజి కొబ్బరి కూర చేశాను. తిన్నాకా అన్నాడు. ''కాబేజిని మామూలుగా మన కత్తిపీటతో తరుగుతారా? లేకపోతే మిషన్ ఉంటుందా?'' తరిగింది కత్తిపీటే అని అంటే నమ్మలేదనుకో - మరి అంత్తల్లాగా సన్నగా తరిగాను- అసలు నేను బీన్నీసు తరిగినా, గోరుచిక్కుడు తరిగినా సన్నగా తరుగుతాను. అలా తరగడం నేర్చుకోవాలి. ఇలా కాబేజి సలాడ్ లాగా కాదు'' కూరకి సున్న మార్కులు వేసింది.

'ఏవిటో, గంగిగోవులాంటి పిల్ల, ఎలా వేగుతుందో!' అనుకున్నాడు దీక్షితులు.

ఇంట్లో ఆంక్షలు భరించలేక, ఓ అడ్వొకేటు దగ్గర గుమాస్తాగా పనిచేయడం మొదలుపెట్టాడు.


ఓసారి కోర్టు నుంచి వస్తూ, అఫ్జల్‌గంజి దగ్గర పచ్చగా బంగారంలా ఉన్న బొబ్బాసికాయలు, బత్తాయి పళ్లని తీసుకొచ్చాడు.

భ్రమరాంబ కనుబొమల్ని పైకి లేపింది.

''ఈ అలవాటెప్పట్నించి? లోపలికెళ్లి కోడలి చేతిలో ఉంచండి''

కోడలి చేతిలో ఉంచాడు.

''ఇన్ని ఏళ్లుగా కాపురం చేస్తున్నాం.



## రూటు మారుస్తున్న వెంకీ

**వెరైటీ పాత్రల్ని పోషించి మెప్పించడం విక్టరీ వెంకటేష్ స్పెషాలిటీ. అయితే ఇప్పటిదాకా ఎన్నో సాంఘిక పాత్రల్లో ప్రశంసలు అందుకున్న వెంకటేష్ ఇంతకాలానికి ఓ భక్తిరస పాత్రని పోషించడానికి రంగం సిద్ధమవుతోందని తెలుస్తోంది. రాఘవేంద్రరావు దర్శకత్వంలో 'భక్త హాథీరామ్' అనే భక్తిరస ప్రధాన చిత్రంలో టైటిల్ పాత్రని వెంకటేష్ పోషించనున్నారని టాలీవుడ్ వార్తలు చెబుతున్నాయి. అన్నమయ్య, శ్రీరామదాసుగా నాగార్జున నటించి శభాష్ అనిపించుకున్నట్టే వెంకటేష్ కూడా ఈ భక్తిరసపాత్రలో ప్రశంసలు అందుకుంటాడనే ఆశిద్దాం.**

ఏ పళ్లు తేకుండానే రోజులు గడిచిపోయాయి! నిష్ఠూరంగా మాట్లాడ్డం నీకు బాగా వచ్చింది''

''ఏదో గొణుగుతున్నారు?''

''అబ్బే, ఏం లేదు, నిన్ను కాదులే''

ఓ సాయంత్రం ఇంటికొచ్చేసరికి, భ్రమరాంబ టీవీ చూస్తోంది.

వస్తూ వస్తూ మిరపకాయ బజ్జీలు తెచ్చిన పొకెట్టుని మధ్యలో ఉన్న టేబుల్ మీద పెట్టాడు. మంచినీళ్లు తెచ్చిన కూతురిని ప్లేట్లు, టమాటా సాస్ తెమ్మన్నాడు.

''కోడలు కనపడలేదు'' చాలాసేపటికి అన్నాడు. రోజూ మంచినీళ్లు తేవడం కోడలి డ్యూటీ.

''సంకురాత్రికి వాళ్లమ్మా వాళ్లింటికెళ్లింది. ఇదిగో ఈ చీర వియ్యాలవారు పెట్టారు.''

నేరేడు పండు రంగు జరీ చీర, భ్రమరాంబ తెల్లటి తెలుపు. ఆ ఒంటికి ఈ చీర బాగా నప్పింది.

''బావుంది'' అని హృదయపూర్వకంగా మెచ్చుకున్నాడు.

''ఏం బావులేదు. ఏ అయిదారు వందల రూపాయల చీర ఇది. వెయ్యి రూపాయలకి తక్కువ చీర నేను కట్టను అని వాళ్లకి ముందే చెప్పాను. అయినా వాళ్లు పెట్టారు. ఇవాళంటే కట్టాను గానీ, దీన్ని మా ఊళ్లోని పనిమనిషి వెంకాయమ్మకి ఇచ్చేస్తాను''

''అయ్యో అదేవిటీ'' అంత మంచి చీరని... ఈ విషయం వాళ్లకి తెలిస్తే...''

''ఆ...'' నాలుకని చప్పరించింది. ''బావుండనీ - బావుండకపోనీ వాళ్లకి తోచింది వాళ్లు పెట్టారు. నాకు తోచింది నేను చేస్తాను''

కోడలు లేనప్పుడు వంటింట్లోకి వెళ్లాడు. అది ఇదివరకటిలాగా అనిపించలేదు అని కోడలి సామ్రాజ్యం. తనో ట్రెస్పాస్సర్‌లాగా అనిపించాడు.

పండగలయ్యాకా కోడల్ని దింపారు వియ్యాలవారు. రెండు రకాల మిఠాయిలు, పళ్లు, బట్టలు పెట్టి వెళ్లారు.

సాయంత్రం కోడలు దీక్షితులకి, భ్రమరాంబకి, ఆడపడుచుకి ప్లేట్లల్లో లడ్డు, మైసూరుపాక్, జంతికలు పెట్టింది.

''అబ్బే- ఊహు... లడ్డులో తీపి లేదు. పాకం సరిగ్గా పడునుగా లేదు. ఈ కాటరర్స్ ఇలాగే చేస్తారు. మైసూరుపాకు మరీ వెర్రి తీపి. నెయ్యి ఎక్కువై కడుపులో దేవేస్తోంది''

మొత్తానికి రెండింటికి మార్కులు వెయ్యలేదు.

టీ పెట్టడానికి వంటింట్లోకి వెళ్లింది.

వంటింటి గుమ్మం దగ్గర నుంచున్నాడు. తల వంచుకుని ముక్కు తుడుచుకుంటున్న కోడల్ని చూసి పాపం! అనుకున్నాడు.

''బాధపడకమ్మా! అన్నీ బావున్నాయి. అద ల్లాగా అంటుంది కానీ, నువ్వేం మనసులో పెట్టుకోకమ్మా!''

''అబ్బే! నేనేం మనసులో పెట్టుకోను. ఏదో పెద్దావిడ. ఆవిడ అంటారు. నేనేం ఫీల్ అవడం లేదు''

''మావగారు, కోడలు నా గురించి చెప్పుకుంటున్నారా! చెప్పుకోండి, చెప్పుకోండి. బాగా చెప్పుకోండి.. ఎన్ని రోజులు చెప్పుకుంటారో నేనూ చూస్తాను'' అంది డ్రాయింగ్ రూంలో నుంచి.

తలవంచుకుంది కోడలు.

ఏదో అనబోయాడు.

''ఉ...ఏం మాట్లాడకండి'' అంది గట్టిగా.

ఓ ఆదివారం.

దీక్షితులు చెల్లెలి కొడుకుకి తాంబూలాలు పుచ్చుకుంటున్నారని దీక్షితుల్ని, భ్రమరాంబని మూడు గంటలకల్లా వచ్చేయమని చెల్లెలు ఫోన్ చేసింది.

''అమ్మాయ్! మేం రాత్రి భోయినానికి వస్తాం. మీ మామగారికి రాత్రి రొట్టెలుండాల్సిందే. రొట్టెలే కదా అని ముందే చేసేసి కూచోకు. వచ్చాకా చెయ్యి. కందిపప్పుని డాబా మీద ఎండబెట్టాం, నీకు గుర్తుందా? పావురాళ్లు పాడుచేస్తాయేమో ఓసారి చూసి, మరో చీరని దాని మీద కప్పి, చుట్టూరా బరువైన్నాపరాళ్లు పెట్టు. చారు మర్చిపోకు. జాగ్రత్త.. మొక్కలకి నీళ్లు పెట్టు'' అంటూ గేటు తీసింది.

ఆమె వెనకాలే దీక్షితులు నడిచాడు.

గేటు తలుపు వేస్తూ ఇంటిగుమ్మం దగ్గర నుంచున్న కోడలిని చూశారు.

పనిమనిషి రాలేదు. ఎందుకంటే దానికీ ఆదివారమే.పాపం.. ఎన్నో పనులు ఒక్కత్తీ చేసుకోవాలి అనుకుంటూ భార్య మాట్లాడిన ఆటో దగ్గరికి చేరుకున్నారు.

''కండువా వేసుకోలేదేం? నేను మంచం మీద పెట్టాను. చూసుకో లేదా!'' అంది భ్రమరాంబ, ఎక్కబోతున్న భర్తని చూసి.

''అరెరే..మర్చిపోయాను.. తెచ్చుకు రానా!''

''మరి! కండువా వేసుకోకపోతే ఏం బావుంటుంది? పెద్దమనుషులందరూ ఉంటారు. వెళ్లి తెచ్చుకురండి.'' కసిరింది.

మెల్లగా గేటు తీసి, ఉన్న మూడు మెట్లు ఎక్కి, దగ్గరగా చేరేసి ఉన్న తలుపుని తియ్యబోయాడు.

లోపల్నుంచి వస్తున్న నవ్వు విని అక్కడా ఆగిపోయాడు.

ఆ నవ్వు కోడలిది.

ఓహో! ఈమె నవ్వగలదన్నమాట.

ఏదో గబగబా మాట్లాడుతోంది.

తలుపు శబ్దం చేస్తే, పాపం నవ్వుతూ మాట్లాడుతున్న ఆమెకు అంతరాయం అవుతుందని, అక్కడే నుంచున్నాడు.

''నీకేం భయం లేదు. అమ్మా... నువ్వు గుర్తు పెట్టుకో నేను నీ కూతుర్ని. నాకేమీ పర్వా లేదు... మా డబ్బా బియ్యే మొదటి సంవత్సరం వరకూ చదివితే నేను పీజీ చేసినదాన్ని.. ఆమె కన్నా నాలుగాకులు ఎక్కువే చదువుకున్నాను.''

దీక్షితులు అలాగే నుంచుండిపోయాడు. నీరసం వచ్చేస్తోంది.

''ఆ.. మా గులకరాళ్ల డబ్బా బయటికెళ్లిందిలే.. మా ఉత్సాయ్ మామగారు ఆమె వెనక వెనకే.. ఉత్త పిరికివాడనుకో. డబ్బాకి భయపడిపోతాడు. ఓ వెర్రిబాగులాయనలే'' అంటూ నవ్వింది పకపకా.

కింద భూమి పగుళ్లు తీస్తోంది. ''పాపం!'' అనుకున్నది ఈమెనా.

''ఎంత! ఓ ఆర్నెల్లు గడవనీ, ఆ డబ్బాని, వాళ్లాయన్ని వేళ్ల మీద ఆడించేయనా! మా హోదాలు అవే అయినా పవర్లు మారిపోతాయిలే. హ్హా...హ్హా..''

భూమిలోకి దిగిపోకుండా తలుపు పట్టుకుని కొట్టి, లోపలికి వెళ్లాడు.

ఫోన్ టక్కున పెట్టేసింది కోడలు పిల్ల. ఆశ్చర్యంగా, సందేహంగా మామ గార్ని చూసింది.

''ఏం లేదమ్మా! కండువా మర్చిపోయాను. అది తీసుకుని వెళ్దామని వచ్చాను'' బాధతో, కుంచించుకుపోయిన మనసుతో, రేపటి అత్తగారి వైపు చూశాడు.

